క్లుప్తంగా

ఏపీఆర్వో బదిలీ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం డీపీఆర్వో కార్యాలయంలో అడిషనల్ పీఆర్వోగా విధులు నిర్వర్తించిన వల్లోజి శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయనను హన్మకొండ డీపీఆర్వో కార్యాలయానికి కేటాయించగా గురువారం అక్కడ విధుల్లో చేరారు.

తురకగూడెం యువకుడికి డాక్టరేట్



రామారావును అభినందిస్తున్న అధ్యాపకులు

కూసుమంచి: మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన జక్కుల రామారావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టరేట్ అందుకున్నారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన రామారావు 2018లో ఎమ్మెస్సీ పూర్తి చేసి యూజీసీ ఎంట్రన్స్‌లో ఆలిండియా 102 ర్యాంకు సాధించి ఫెలోషిప్ అందుకున్నారు. ఫెలోషిప్‌తో ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీతో పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా పొందాడు. ఈ మేరకు రామారావును గ్రామస్తులు, పలువురు విద్యావేత్తలు అభినందించారు.

సర్వేల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని వినతి

ఖమ్మంఅర్బన్: నాగపూర్ – అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వే పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని పలువురు కోరారు. ఈ మేరకు నగర పరిసర ప్రాంతాల రైతులు గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం పలువురు రైతులు, ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చినా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల నుంచి చింతకాని మండలం కొదుమూరు వరకు సర్వే పేరిట తరచూ సిబ్బంది హడావుడి చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా పలువురికి ఫోన్ చేసి ప్రకటించిన మేరకు పరిహారం తీసుకోవాలని బెదిరిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయంలో అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

బదిలీ అధికారులకు వీడ్కోలు

కూసుమంచి: మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసిన పలువురు ఉద్యోగులతో పాటు 13 మంది గ్రామ కార్యదర్శులు బదిలీపై వెళ్లగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వారికి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలో పని చేసి బదిలీ అయిన 12 మంది పంచాయతీ కార్యదర్శుల మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంపీడీఓ అశోక్, ఎంపీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వనమహోత్సవం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా గురువారం 53వ డివిజన్ గట్టయ్య సెంటర్‌లో శ్రీ నిలయం అపార్ట్‌మెంట్‌లో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కడవెండి వేణుగోపాల్, సత్యనారాయణ, నన్నెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురానికి చెందిన సీపీఎం నాయకులు చావా లెనిన్ మూడు రోజుల క్రితం మృతి చెందగా ఆయన పిల్లలు విదేశాల నుంచి వచ్చాక గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. కాగా, సీపీఎం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, నున్నా నాగేశ్వరరావు, పోతినేని సుదర్శన్‌రావు, బుగ్గవీటి సరళ, ఏటుకూరి రామారావు, సీపీఐ నాయకుడు భాగం హేమంతరావు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ

కామేపల్లి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని సంఘం మండలాధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేసి మాట్లాడారు. కార్యదర్శి రాములు, శ్రీనివాసరావు, వెంకన్న, రాంబాబు, సాంబశివరెడ్డి, రామయ్య, బాలాజీ, ఇందిరా, రేవతి, లలిత పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	డెడ్‌పూల్ అండ్ ఉల్వరైన్
సాయిరాం	డెడ్‌పూల్ అండ్ ఉల్వరైన్
ఆదిత్య	డెడ్‌పూల్ అండ్ ఉల్వరైన్
శ్రీనివాస	రాయన్
సినీ గెలాక్సీ	పురుషోత్తముడు

- ఖమ్మం గాంధీచౌక్

తహసీల్ వద్ద వేచి చూస్తున్న దరఖాస్తుదారులు



సర్టిఫికెట్ల సవాల్..!

ఖమ్మం కార్పొరేషన్‌కు అర్బన్ తహసీల్ ఒక్కటే దిక్కు

- రోజుకు వందల సంఖ్యలో దరఖాస్తులు
- పని భారంతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం
- భర్తీ కానీ డీటీ స్థానం
- ఇబ్బందిపడుతున్న దరఖాస్తుదారులు

ఖమ్మంఅర్బన్: రెండు తహసీల్దార్ కార్యాలయాల్లో చేసే పని ఒకే కార్యాలయంలో (ఖమ్మంఅర్బన్) చేయాలంటే సిబ్బందికి పని భారంతో పాటు వివిధ పనుల కోసం వచ్చే వారికి సకాలంలో సర్టిఫికెట్లు అందిచకలేక ఇబ్బంది పడుతున్నారు. సుమారు 6 లక్షలపైగా జనాభా ఉన్న ఖమ్మం కార్పొరేషన్ మొత్తానికి ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉంది. దీనిలో కులం, ఆదాయం, జనన, మరణ తదితర సర్టిఫికెట్లతో పాటు భూ సమస్యలు వంటి వాటిపై రోజుకు వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుంటాయి. వాటిని పరిష్కరించాలంటే అధికారులకు తలకుమించిన భారంగా మారింది.

కార్యాలయం వద్ద పడిగాపులు..

రోజువారీగా అందిన దరఖాస్తులను పరిష్కరించాలంటే వాటిని వరస క్రమంలో పరిశీలించి దానికి సంబంధించిన నివేదిక ఇచ్చాక సరిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది. ఇలా వందల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడం ఒక్క రోజులో అయ్యేలా లేకపోవడంతో రోజురోజుకు వాటి సంఖ్య పెరిగి దరఖాస్తుదారులు కార్యాలయం పడిగాపులుకాయాల్సి వస్తోంది. వీఆర్‌ఓలు లేకపోవడంతో ఇద్దరు ఆర్‌ఐలు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విచారణ నివేదిక ఇవ్వడం కష్టంగా మారింది. ఇలా వారికి పనిభారంతో దరఖాస్తులు చేసిన వారు సార్.. మా సర్టిఫికెట్ అంటూ అధికారుల వద్ద వేచి ఉండాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది

ప్రొటోకాల్ బాధ్యతతో ఇక్కట్లు..

తహసీల్దార్ రెవెన్యూ పరమైన పనులతో పాటు తహసీల్దార్ రిజిస్ట్రేషన్ పనులతో పాటు ఇతర రెవెన్యూ పనులు చూస్తుంటే కార్యాలయంలో ప్రధానంగా సర్టిఫికెట్లు డిప్యూటీ తహసీల్దార్ ద్వారా జారీ చేసేవారు. గత వారం రోజు క్రితం అసలే పనిభారంతో ఇబ్బంది పడుతుంటే ఉన్న డీటీని బదిలీ చేశారు. ఆ స్థానంలో ఎవరినీ భర్తీ చేయకపోవడంతో మరింత భారంగా మారింది. ప్రత్యేకంగా విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులు కాలేజీలు, పాఠశాలలు, గురుకులాల్లో చేరాలంటే ఆదాయం, కులం ధ్రువీకరణ అవసరం ఉండడంతో వాటి కోసం వందల దరఖాస్తులు వస్తున్నాయి. ఏప్రిల్, జూన్, జూలైలో అత్యధికంగా రోజుకు 200 నుంచి 300 వరకు దరఖాస్తులు కూడా వచ్చాయని, ప్రస్తుతం సుమారు వంద వరకూ వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

డీటీ బదిలీతో మరింత భారం

రోజుకు వందకు పైగా దరఖాస్తులు..



రోజుకు వందకుపైగానే దరఖాస్తులు వస్తున్నాయి. సాధ్యమైనంత వరకు సెలవు రోజుల్లోనూ పనులు చేస్తూ పరిష్కరిస్తున్నాం. ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలనే ప్రయత్నం చేస్తున్నాం. ఇటీవల డీటీ బదిలీ కావడంతో కొంత ఒత్తిడి పెరిగింది. త్వరలోనే ఈ సమస్య కూడా తీరుతుంది.

– సీహెచ్.స్వామి, తహసీల్దార్

నగరంలో ఏకైక మండలం కావడంతో ప్రొటోకాల్ బాధ్యతలు, కోర్టు కేసులు, రిజిస్ట్రేషన్, తాజాగా సర్టిఫికెట్లు కూడా ఇవ్వాల్సి రావడంతో కొంతమేర జాప్యం జరుగుతోంది. లక్షల జనాభా ఉండి వందల సంఖ్యలో రోజు వారి దరఖాస్తులను పరిష్కరించాల్సిన అర్బన్ తహసీల్‌లో పని భారం తగ్గించి వెంటనే దరఖాస్తులను పరిష్కరించేలా సరిపడా అధికారులను భర్తీ చేయాలని, ప్రొటోకాల్ కోసం ప్రత్యేక విభాగం కేటాయించితే కొంతమేర పనులు సులువు అయ్యేందుకు మార్గం సుగమమం అవుతుందని కార్యాలయ సిబ్బంది అధికారులను కోరుతున్నారు.

అధికారులకు సన్మానం..



ఖమ్మం మామిళ్లగూడెం: కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఉర్దూ జర్నలిస్టులు

ఉర్దూ జర్నలిస్టుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఉర్దూ జర్నలిస్టుల ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రెండో అధికారభాషగా ఉర్దూ కొనసాగుతున్నప్పటికీ, ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల మీద రాయకపోవటాన్ని ప్రస్తావించారు. ఉర్దూ మీడియాకు కేవలం ఒక్క అక్రిడిటేషన్ ఇచ్చి అసమానత ప్రదర్శిస్తున్నారన్నారు. ఎండీ.జవ్వాద్ అహ్మద్, మజహర్, ఇమ్రాన్, సయ్యద్ సాబీర్, ఎండీ. ఇంతియాజ్, ఎస్‌కె.జానీపాషా పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు..

కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సి.సత్యనారాయణ దంపతులను రిటైర్డ్ తహసీల్దార్ ఆర్.రవీందర్ గురువారం ఖమ్మం వీడివోస్‌కాలనీలో ఘనంగా సత్కరించారు.



ఖమ్మంమయూరిసెంటర్: ఏఎస్‌డబ్ల్యూఓ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

రిటైర్డు ఉద్యోగులు జనార్దన్‌రావు, ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, ఎండి.గౌస్ పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలతకు..

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఖమ్మం ఏఎస్‌డబ్ల్యూఓగా విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన ఏ.శ్రీలతను గురువారం సన్మానించారు. ఖమ్మంలోని బాలుర 'బీ' వసతిగృహంలో ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, వసతిగృహ సంక్షేమ అధికారులు ఆమెను సన్మానించి మాట్లాడారు. వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావుతో పాటు ఎం.వీరయ్య, అబ్దుల్ రహూఫ్, కొత్త వెంకటేశ్వర్లు, కె.మురహరి, ఎస్.వెంకటరెడ్డి, టి.స్టాలిన్, విజయ,విజయలక్ష్మి, కోమలి, బేగం, అబ్దుల్ సత్తార్, వినోద, మాధవి, వరలక్ష్మి, నాగరాజు, అన్వర్, ఓదెలు, శ్రీధర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తగ్గని డెంగీ కేసులు

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో డెంగీ బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మండలంలోని జల్లేపల్లి, పాతర్లపాడు, జూపెడల్లో 30కి పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. గురువారం పాతర్లపాడులో ముగ్గురికి, జల్లేపల్లిలో ఒకరికి డెంగీ నిర్ధారణ అయింది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గువ్వలగూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. ఏపీలోని పిడుగురాళ్లకు చెందిన యం.నాగరాజు (32) బైక్‌పై ఖమ్మం వెళ్తుండుగా గువ్వలగూడెం వద్దకు రాగానే వెనక నుంచి కారు వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో యువకుడు కు తీవ్ర గాయాలయ్యాయి. ఈమ మేరకు అదే కారులో ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై నిలబడ్డ వ్యక్తికి..

నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండాకు చెందిన తేజావత్ కోటేశ్వరరావు పొలం పనులు ముగించుకుని రోడ్డుపై నిలబడ్డాడు. ఈ మేరకు నాచేపల్లికి చెందిన ఓ వ్యక్తి కోటేశ్వరరావుని బైక్‌తో వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావుకి గాయాలవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కూసుమంచి: మండలంలోని బికారితండాలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తండాకు చెందిన తేజావత్ మీటియా ఇంట్లో గురువారం రాత్రి పోలీసులు తనిఖీ చేపట్టి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేశారు.

జ్వరంతో మహిళ మృతి

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో జ్వరంతో బాధపడుతున్న ఆర్.అనసూరమ్మ(85) గురువారం మృతి చెందింది. గ్రామస్తులు కథనం ప్రకారం.. కొంతకాలంగా బోధకాలుతో బాధపడుతున్న ఆమెకు జ్వరం సోకడంతో చికిత్స పొందుతూనే మృతి చెందినట్లు తెలిపారు. అలాగే, మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఎం.నరసింహారావు(50) సైతం బోధకాలుతో బాధపడుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లోనే ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొనగా, పారిశుద్ధ్య లోపంతోనే ఇలా జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

నలుగురిపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన పస్తం దుర్గాప్రసాద్, లక్ష్మి, రాజు, చంద్రకళపై నమోదైన కేసును కొట్టివేస్తూ సంచార న్యాయస్థానం న్యాయాధికారి బిక్కం రజని గురువారం తీర్పు చెప్పారు. ఇందులో దుర్గాప్రసాద్ భార్య పస్తం మావిళ్లమ్మ చెల్లెలిని దుర్గాప్రసాద్ తమ్ముడికి ఇచ్చి పెళ్లి చేయాలని వేధిస్తున్నారంటూ 2020 నవంబర్ 22న ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం నలుగురిపై కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కాగా, నిందితుల తరపున స్వామి రమేష్, యర్రా జ్ఞానేష్ వాదించారు.

యువకుడిపై కోతుల దాడి

కూసుమంచి: మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన రవిపై గురువారం కోతులు దాడిచేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. తన ఇంటి సమీపంలో కోతులు చిన్న పిల్లలపై దాడిచేసేందుకు యత్నించగా రవి అడ్డుకోగా అవి అతనిపై దాడిచేసి గాయపరిచాయి. వెంటనే రవిని స్థానికులు కూసుమంచిలోని పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. గ్రామాల్లో కోతుల స్వైర్య విహారానికి అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ చూస్తే తెలుస్తోందని, ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్‌కుమార్ లు గురువారం వేర్వేరు ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రబడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.3% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తుశుద్ధి ఉందని తెలిసిందన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం..

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగా కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బి అతిగృహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్, నాయకులు వంశీ, కిరణ్, సాయి, అనిల్, గణేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు నిధులు శూన్యం..

రఘునాథపాలెం: జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయింపులకు నోచుకోలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీల్లో నిధులు లేక పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, నిధులు ఇచ్చి పారిశుద్ధ్యం కాపాడాలని బడ్జెట్‌లో ప్రాముఖ్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో ఆర్యవైశ్యులకు అన్యాయం

నేలకొండపల్లి: రాష్ట్ర బడ్జెట్ ఆర్యవైశ్యులకు తీరని అన్యాయం చేసిందని, అందుకు ఆ పార్టీలో ఉన్న ఆర్యవైశ్యులు రాజీనామా చేయాలని వాసవి సేవా సమితి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం దారుణమని, కాంగ్రెస్ ఆర్యవైశ్యులను మోసం చేసిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థుల నిరసన

కేంద్ర ప్రభుత్వం విద్యారంగంకు మొండిచేయి ఇచ్చిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్ ఆరోపించారు. కేంద్రం తీరు ను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి హరీష్, అరవింద్, ఉదయ్‌కిరణ్, నిఖిల్, మనోహర్, రాజు, రాజేష్, కీర్తి, రజిత, శృత, వనజ, భవాని, అశ్విని, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్‌ల పంపిణీ



బ్యాగ్‌లతో విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రేస్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్కూల్‌బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు సొసైటీ నిర్వాహకులు పంపిణీ చేశారు. సొసైటీ బాధ్యులు టి.ఆదినారాయణ, మరళిధర్‌రెడ్డి, సతీష్, ప్రధానోపాధ్యాయులు డీఎస్. ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నవీన్, జెసన్, జగదీష్, విజయలక్ష్మి, కృష్ణాబాయి, పీడీ విజయకుమార్, అర్చన ఉన్నారు.

శిథిలమైన భవనాలు తొలగిస్తాం

- మేయర్ నీరజ



పోస్టాఫీస్ కూల్చివేత పనులను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించి తొలగిస్తామని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. గురువారం శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా ఉన్న పాత పోస్టాఫీస్ భవనాన్ని కూల్చివేత పనులను మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో శిథిలావస్థ భవనాలతో ప్రమాదం పొంచి ఉందని, శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించాలని అధికారులకు సూచించామన్నారు. పోస్టాఫీస్‌కు సంబంధించి పాత భవనానికి కార్పొరేషన్ నుండి రెండు సార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో కూల్చివేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుందర, మాజీ సిటీ గ్రంథాలయ చైర్మన్ అశ్రీఫ్, టీపీఎస్‌లు ఇటికాల భాస్కర్, నరేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

విష జ్వరాలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. నగరంలోని 49వ డివిజన్ వెంకటేశ్వరనగర్, 9వ డివిజన్ రోటరీనగర్ ప్రాంతాల్లో డెంగీ బారిన పడిన బాధితుల ఇళ్లను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మేయర్ సందర్శించారు. అసిస్టెంట్ కమిషనర్ ఏ.సంపత్‌కుమార్, ఎస్సైలు షేక్ బాబు, మలేరియా అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

కామేపల్లి: గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని వైరా ఏటీడీఓ జహీరుద్దీన్ అన్నారు. మండలంలోని జీపీఎస్ టేకులతండా పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏటీడీఓ జహీరుద్దీన్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సిలార్‌సాహెబ్

తిరుమలాయపాలెం: ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ అన్నారు. గురువారం మండలంలోని జూపెడ గ్రామంలో జ్వరాల తీవ్రత అధికంగా ఉండడంతో సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వసుంధరతో కలిసి ఇంటింటికి తిరిగి దోమల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. పాత టైర్లు, కూలర్లు పనికిరాని వస్తువులలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీటి కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ, డాక్టర్ వసుంధర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరి సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



వెదజల్లే పద్ధతిని వివరిస్తున్న ఏఓ

కూసుమంచి: వరి సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని ఏఓ రామడుగు వాణి కోరారు. గురువారం జక్కేపల్లి గ్రామంలో నేరుగా వరివిత్తే పద్ధతితో పాటు వెదజల్లే, డ్రమ్ సీడర్‌తో వరి సాగు విధానాన్ని రైతులకు వివరించారు. ఈ పద్ధతుల్లో సాగు చేస్తే పంట కాలం తగ్గుతుందని, వ్యయం కూడా ఎకరాకు రూ.8వేల వరకు ఆదా చేయవచ్చున్నారు. ఏఈఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు ముగ్గురి అప్పగింత



కుటుంబసభ్యుల వద్దకు చేరుస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: అన్నం ఫౌండేషన్ ఆశ్రయంలో తలదాచుకున్న ముగ్గురు వ్యక్తులను వారి వివరాలు గుర్తించి కుటుంబసభ్యులకు గురువారం అప్పగించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మతిస్థిమితం కోల్పోగా చేరదీసిన యువకుడు ఆరోగ్యం బాగుపడిన తర్వాత తన దగ్గర ఉన్న ఆధార్‌కార్డు ప్రకారం తన పేరు ఆదిత్య ముండా, అస్సాం రాష్ట్రం, డిబ్రుగర్ జిల్లా వాసిగా గుర్తించామని, ఈ మేరకు అస్సాం నుండి వచ్చిన కుటుంబ సభ్యుడైన బాలు రామ్ గోగైకు అతన్ని అప్పగించి రూ.5వేలు వితరణ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మతిస్థిమితం కోల్పోయిన యువకుడిని కామేపల్లి పోలీసులు ఫౌండేషన్‌కు అప్పగించగా అతన్ని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీస్ పరిధిలోని కీతవారిగూడెం వాసిగా గుర్తించి ఫౌండేషన్ అంబులెన్స్‌లో తన గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. ఇటీవల శ్రీశ్రీ సర్కిల్ ప్రాంతంలో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి అతను వైరా మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన ముత్తయ్యగా గుర్తించి గ్రామానికి వెళ్లి అతని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

క్రీడల నిర్వహణ కమిటీ ఎన్నిక

ఖమ్మంలీగల్: జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న క్రీడల నిర్వహణ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఓ.ఉపేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చింతనిప్పు వెంకట్, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీ గోపి, ట్రెజరర్ శ్రీనివాసరావు, స్పోర్ట్స్–గేమ్స్ సెక్రటరీ యుగంధర్, మహిళా రెప్రజెంటేటివ్ లలిత ఆధ్వర్యంలో కమిటీలు ఎన్నుకున్నారు.

కార్మికులకు స్థలం, ఇళ్లు మంజూరుచేయాలి



మాట్లాడుతున్న వెంకన్న

రఘునాథపాలెం: భవన నిర్మాణరంగ కార్మికులకు ఇంటి స్థలంతోపాటు, ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పువ్వాడనగర్ కాలనీలో సంఘం సమావేశం అన్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5,000 పింఛన్ ఇవ్వాలని, అసెంబ్లీలో ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుపాకుల చందర్‌రావు, నరసింహారావు, అశోక్, శ్రీను, రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల హాస్పిటల్‌ను తిరుమలాయపాలెంలోనే కొనసాగించాలని కోరుతూ అఖిలపక్షం నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శులు కొమ్ము శ్రీను, గొర్రెపాటి రమేష్ మాట్లాడుతూ... ఆస్పత్రిని కూసుమంచికి తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే ఈ నెల 29న మహాధర్నా నిర్వహిస్తామన్నారు. నాయకులు మట్టి దుర్గాప్రసాద్, కొమ్ము పుల్లయ్య, గంటా కృష్ణ, గుగ్గిళ్ల అశోక్, కొలిచలం స్వామి, పద్మనాభుల సుధాకర్, మద్దినేని శ్రీనివాస్, చింతిరాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీరామ నామం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ రామదాసు ధ్యాన మందిరం గురువారం శ్రీరామనామ కీర్తనలతో మారుమోగింది. శ్రీ రాముడి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం, నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం, అజయ్‌తండాకు చెందిన భక్తమండలిల బాధ్యులు కచేరీ నిర్వహించారు. భక్తరామదాసు భజన సొసైటీ బాధ్యులు సిద్ధేశ్వరస్వామి, తేజావత్ శివాజీ, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామదాసు మందిరంలో పూజలు